జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 22-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 762 పేజీలు: 4 వెల : రూ.7

## పని ఒత్తిడితో.. ప్రాణాలు పోతున్నాయి!







* అలుపెరుగని సేవలకు.. చావే శరణ్యమా!
* మండపల్లి డిజిటల్ అసిస్టెంట్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి
* ఆధార్ విధుల్లో ఉండగా అస్వస్థత
* ఏకకాలంలో నాలుగు రకాల విధులతో ఒత్తిడి
* పని ఒత్తిడిలో సచివాలయ ఉద్యోగులు
* రౌతు మెహర్ మృతదేహంతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగుల ధర్నా
* కన్నీరుమున్నీరుగా విలపించిన తండ్రి

ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త): మండపల్లి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రౌతు మెహర్ (32) అనే యువకుడు శుక్రవారం ఆకస్మికంగా మృతిచెందాడు. గురువారం స్థానిక ఆదిత్య కాలేజీలో ఆధార్ శిబిరంలో విధులు నిర్వహిస్తున్న మెహర్ అస్వస్థతకు గురయ్యాడు. బ్రెయిన్ స్ట్రోక్‌కి గురికావడంతో ఇచ్ఛాపురం పట్టణంలో ద్వారకా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మెహర్ మృతిచెందారు. మెహర్ స్వగ్రామం గార మండలంలోని ఆరంగిపేట. తండ్రి మల్లేశ్వరరావుతో పాటు తల్లి, అక్క తమ్ముడు ఉన్నారు. మెహర్‌కి ఇంకా వివాహం కాలేదు. పని ఒత్తిడి, కుటుంబానికి దూరంగా ఉండడంతోనే మానసికంగా కృంగుబాటుకు గురై మెహర్ మృతిచెందినట్టు తోటి సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. మెహర్ ఒకేసారి డిజిటల్ అసిస్టెంట్, జనాభా లెక్కల మండల కోఆర్డినేటర్, బీఎల్వోగా ఎస్ఐఆర్ విధులు, ఆధార్ ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నాడు. అన్ని విధులు ఒకేసారి చేపట్టాల్సి రావడంతో ఒత్తిడికి గురైనట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని తోటి సచివాలయ ఉద్యోగుల వద్ద చెప్పి బాధపడినట్టు సమాచారం. ఏదిఏమైనా ఓ యువకుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం బాధాకరం.

సచివాలయ ఉద్యోగులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. జీతం చూస్తే బారెడు..ఒత్తిడి మాత్రం అధికంగా ఉంది. మండల స్థాయి అధికారుల నుంచి గ్రామస్థాయిలో వీఆర్వో వరకూ వారిపై అన్నిరకాలుగా ఒత్తిడి పెంచుతున్నారు. సమీక్షలు, క్షేత్రస్థాయిలో పరిశీలనలు అంటూ క్షణం తీరిక లేకుండా గడపాల్సి వస్తోంది. మండల అధికారులు పిలిచిన వెంటనే హాజరుకావాలి. అధికారుల ముప్పేట ఒత్తిడితో చాలామంది ఉద్యోగంపై విసుగు చెందుతున్నారు. తప్పక కొందరు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. కుటుంబసభ్యుల ఒత్తిడితో నెట్టుకొస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు అందరూ 30 సంవత్సరాల్లోపు వయసున్న వారే. ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తిచేసిన వారు సచివాలయ ఉద్యోగాలు దక్కించుకున్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వేలాది రూపాయల జీతాలు వచ్చే అవకాశమున్నా ప్రభుత్వ కొలువుగా భావించి సచివాలయాల్లో చేరిపోయారు. తీరా ఇక్కడకు వచ్చిన తరువాత పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. జీతం చూస్తే తక్కువగా ఉంది. ఏదో ఊహించుకొని వస్తే.. ఏదో జరిగిందన్న భావం వారిని వెంటాడుతూ వస్తోంది. తమ తోటి వారు నగరాలు, విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించి వేలకు వేలు సంపాదిస్తుంటే.. తాము మాత్రం ఇబ్బంది పడుతున్నామని వారిలో నిర్వేదం అలుముకుంది. ఉద్యోగాలు మానేస్తామంటే క టుంబసభ్యుల నుంచి సుముఖత వ్యక్తం కావడంలేదు. ఈ తరుణంలోనే ఎక్కువ మంది ఒత్తిడికి గురవుతున్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట మృతదేహంతో నిరసన మోహర్ స్వగ్రామం గార మండలంలోని ఆరంగిపేట. తండ్రి మల్లేశ్వరరావుతో పాటు తల్లి, అక్క ఉన్నారు. ఇంకా వివాహం కానీ మెహర్ కుటుంబానికి దూరంగా ఉండడంతోనే మానసికంగా కృంగుబాటుకు గురై మృతి చెందారని సహచరులు అంటున్నారు. ఒడిశా గొలాంత్ర అమిత్ హాస్పిటల్ లో మృతి చెందిన మెహర్ మృత దేహాన్ని అంబులెన్స్‌లో ఇచ్ఛాపురం తీసుకొచ్చారు. శవాన్ని తాహశీల్దార్ కార్యాలయం గేటు వద్దకు తీసుకొచ్చి కార్యాలయం గేటు వద్ద నినాదాలు చేశారు. సచివాలయ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని ఒకేసారి రెండు మూడు బాధ్యతలు అప్పగిస్తున్నారని, చేయకపోతే చర్యలు తప్పవని మా పై అధికారులు చెబుతున్నారు. అలా అని చేస్తే పని ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురౌతున్నాం. పని ఒత్తిడి తగ్గించాలని ఉద్యోగులంతా అంబులెన్స్ వద్దే నినాదాలు చేశారు. చేతికందొచ్చిన కొడుకు తిరిగిరాని లోకానికి వెళ్లిపోవటంతో తండ్రి మల్లేశ్వరరావు కొడుకు శవం వద్ద బోరున ఏడ్చారు. ఇలాంటి ఆకస్మిక ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండాలంటే పని ఒత్తిడి తగ్గించి ఆదుకోవాలని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. అనంతరం అంబులెన్స్‌తో తోటి సహచర ఉద్యోగులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఏదిఏమైనా ఓ యువకుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం బాధాకరం. మృతి పట్ల తెలుగుదేశం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి మాజీ సర్పంచ్ ప్రతినిధులు పిట్ట మామయ్య శశి రేఖా రెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు. తోటి సచివాలయం ఉద్యోగుల లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

* వైద్య రంగం బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
* మానవతా దృక్పథంతో మెరుగైన వైద్య సేవలు అందించాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* రూ.290 లక్షలతో కోటబొమ్మాళి సీహెచ్‌సీ నిర్మాణం * కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల ప్రారంభం

## 100 పడకల ఆసుపత్రిగా.. కోటబొమ్మాళి సీహెచ్‌సీని మారుస్తా



కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, ఆగస్టు 21 (వార్త): కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డ్ నిధులు రూ.290 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య కేంద్రం బ్లాక్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను పెంచేలా అవగాహ కల్పించి ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రమైన వాతావరణం, పారిశుద్ధ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ లక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి.గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



### విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో డిగ్రీ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్న తన చిరకాల కోరిక సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.యువతకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడంతో పాటు వారికి విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపన అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల రూ.2,600 కోట్ల పెట్టుబడితో 450 ఎకరాల విస్తీర్ణంలో కోరమండల్ పరిశ్రమను మూలపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. దేశంలోని ప్రముఖ పరిశ్రమలు మూలపేటలో తమ పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావడం శుభ పరిణామామని, రానున్న రోజుల్లో మూలపేట పోర్టు ప్రాంతం పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందనుందని అన్నారు.విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తువిద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నత విద్యకు సంబంధించి సమగ్ర విధానాలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చారిత్రాత్మక చర్యలు చేపడుతున్నారని తెలిపారు.కోటబొమ్మాళి డిగ్రీ కళాశాలకు త్వరలో శాశ్వత భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా అవసరమైన కోర్సులను డిగ్రీ కళాశాలలో మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంప్రజా ప్రభుత్వంగా అన్ని వర్గాల సంక్షేమం, అన్ని రంగాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి అన్నారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడినప్పటికీ వంశధార కాలువల నుంచి సాగునీటిని అందించి రైతులకు అండగా నిలిచామని మంత్రి గుర్తు చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంట బీమా నమోదుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శత శాతం పంట బీమా నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు.కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లుకోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను చేపట్టి గత ఏడాది కంటే మరింత వైభవంగా ఈ ఏడాది కొత్తమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.అనంతరం డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను మంత్రి చేతులమీదుగా మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఇంచార్జ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, టి. గోవిందమ్మ, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, ఎన్.ఎస్. ఎన్.మూర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. అప్పన్న, తదితరులు, పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

**-తెల్లవారుజామునే ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులు, ప్రత్యేక అలంకరణలు**

**-సంప్రదాయబద్ధంగా కలశ ప్రతిష్ఠ**

**-లక్ష్మీ స్తోత్రాలతో మార్మోగిన ఆలయాలు, ఇళ్లు**

**పలాస, ఆగస్టు 21(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల గుమ్మాల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, మామిడి ఆకులతో అలంకరించి ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యారు. వ్రతంలో భాగంగా మహిళలు సంప్రదాయబద్ధంగా కలశాన్ని ప్రతిష్ఠించారు. కలశానికి పసుపు, కుంకుమలతో అలంకరణ చేసి, మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిమకు పట్టుచీరలు, పూలమాలలు, ఆభరణాలు సమర్పించి శోభాయమానంగా అలంకరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా అష్టోత్తర శతనామావళి, లక్ష్మీ స్తోత్రాలను భక్తిశ్రద్ధలతో పఠించారు. అమ్మవారికి పండ్లు, పిండి వంటలు, నైవేద్యాలు సమర్పించి హారతులు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పరస్పరం వాయనాలు ఇచ్చిపుచ్చుకుని వరలక్ష్మీ వ్రతం విశిష్టతను చాటుకున్నారు. కుటుంబ సంక్షేమమే లక్ష్యంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు కుటుంబ శ్రేయస్సుకు ప్రతీకగా భావిస్తూ నిర్వహించారు. ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉండాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని మహాలక్ష్మీ అమ్మవారిని ప్రార్థించారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబంలో ప్రశాంతత, సౌభాగ్యం నెలకొనాలని కోరుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంతో వ్రతం సందర్భంగా జంట పట్టణాల్లోని పలు ఇళ్లలో ప్రత్యేక పూజలు జరగడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతాన్ని ఆచరించి, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించడం ద్వారా కుటుంబ విలువలు, సంస్కృతీ సంప్రదాయాల పట్ల తమకున్న విశ్వాసాన్ని చాటుకున్నారు.



## వరలక్ష్మి అవతారంలో విజయదుర్గమ్మ



**సోంపేట, ఆగస్టు 21(వార్త):** శ్రావణ శుక్రవారం సందర్భంగా సోంపేటలోని శ్రీ విజయదుర్గమ్మ.. వరలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణ శివారున గల శ్రీ విజయదుర్గా ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. అమ్మవారికి ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలతో కుంకుమ పూజలు చేపట్టారు. రాత్రి వరకు భక్తులు తాకిడి కొనసాగుతూనే ఉంది. సాయంత్రం ఆలయ ఆవరణలో భజన కాలక్షేపం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ధనలక్ష్మిగా కనకదుర్గమ్మ...



బారువ గ్రామంలో వెలసిన శ్రీ కనకదుర్గమ్మ శ్రావణ శుక్రవారం సందర్భంగా ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి సరికొత్త కరెన్సీ నోట్లతో దండలు గుచ్చి మాలలు వేశారు. అమ్మవారి అలంకరణ భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## లేబర్ కాలనీలో వాడబలిజ సంక్షేమ సంఘ భవనానికి పునాది

**- భవన నిర్మాణంతో సామాజిక సేవలకు మరింత ఊతం**

**పలాస, ఆగస్టు 21(వార్త):** శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని పలాస లేబర్ కాలనీలో వాడబలిజ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి పునాది ముహూర్త కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. వాడబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ భవనం సంఘ సభ్యుల సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడేలా నిర్మించనున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. సంఘ సభ్యుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్‌లో సామాజిక సేవా కార్యక్రమాలకు ఈ భవనం వేదికగా నిలుస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ వాడబలిజ సామాజిక వర్గ అభ్యున్నతికి సంఘం తరఫున మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ సభ్యుల సహకారంతో భవన నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. శ్రావణ శుక్రవారం రోజున భవన నిర్మాణానికి పునాది వేయడం శుభపరిణామంగా భావిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు అంబటి ఆనందరావుతో పాటు సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.



## పొలాల్లోకి ఆవులు.. రైతుల్లో ఆందోళన





**సంతబొమ్మాళి, ఆగస్టు 21(వార్త):** నౌపడ గ్రామ పరిసర ప్రాంతాల్లో పశువుల సంచారం రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. యజమానులు అదుపు లేకుండా వదిలేస్తున్న ఆవులు పొలాల్లోకి ప్రవేశించి ప్రస్తుతం సాగులో ఉన్న నారును మేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు, సాగు ఖర్చుల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు పశువుల బెడద మరింత సమస్యగా మారింది. ఎంతో శ్రమించి నాట్లు వేసిన నారును ఆవులు మేయడంతో పంట నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

పశువులను అదుపులో ఉంచాలని పలుమార్లు కోరుతున్నా కొంతమంది యజమానులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ పరిసరాల్లో పర్యటించి పొలాల్లోకి పశువులను వదిలేస్తున్న యజమానులను గుర్తించాలని రైతులు కోరుతున్నారు. పశువుల యజమానులకు నోటీసులు జారీ చేసి, పంటలకు నష్టం కలగకుండా కట్టడి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టపోతే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నౌపడ ప్రాంత రైతులు కోరుతున్నారు.



## పాథాలజిస్ట్ ఆధ్వర్యంలో నూతన ల్యాబ్ ప్రారంభం

**- అత్యంత కచ్చితమైన వైద్య నిర్ధారణ పరీక్షలతో మెరుగైన సేవలు**

**- మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్**

**పలాస, ఆగస్టు 21(వార్త):** ప్రజలకు అత్యంత కచ్చితమైన వైద్య నిర్ధారణ పరీక్షలను అందించాలనే లక్ష్యంతో సూర్య స్కాన్ అండ్ డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో నూతన పాథాలజిస్ట్-రన్ ల్యాబ్ ప్రారంభం చేశారని పలాస మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలోని శ్రీనివాస్ లాడ్జి సమీపంలో డిగ్రీ కాలేజ్ రోడ్డులో ల్యాబ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ శ్రీకాంత్ నిర్వాహకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య నిర్ధారణలో నాణ్యత, కచ్చితత్వం కీలకమని పేర్కొంటూ అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించే విధంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఎండీ (పాథాలజీ), డాక్టర్ హెచ్.వి. సురేష్ కుమార్, ఎండీ (రేడియో డయాగ్నొసిస్) వంటి వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండటం ద్వారా ప్రజలకు మరింత విశ్వసనీయమైన వైద్య నిర్ధారణ సేవలు లభించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వైద్య చికిత్సలో వ్యాధిని సకాలంలో గుర్తించడం, సరైన నిర్ధారణ చేయడం ఎంతో ప్రాధాన్యమైందని దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆధునిక వైద్య నిర్ధారణ సదుపాయాలతో ప్రారంభమైన నూతన ల్యాబ్ స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా నిలవాలని ఆకాంక్షించారు. పలాస ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన వైద్య సేవలను విస్తరించడంలో ఇటువంటి సంస్థలు మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సూర్య స్కాన్ అండ్ డయాగ్నొస్టిక్స్ నూతన ల్యాబ్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విజయవంతంగా అభివృద్ధి చెందాలని దువ్వాడ శ్రీకాంత్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు



## మకరాంపురం - కవిటి రోడ్డుకు మరమ్మతులు

**-గుంతలమయమైన రహదారి - ప్రయాణికులకు తప్పని తిప్పలు**

**-స్పందించని ఆర్అండ్‌బీ అధికారులు**

**పట్టించుకున్న ఓ ఆలయ ధర్మకర్త**

**సొంత సొమ్ముతో బాగు చేయిస్తున్న రమణస్వామి**

**కంచిలి, ఆగస్టు 21 (వార్త):** మకరాంపురం - కవిటి రహదారి గుంతలమయంగా మారింది. ఆదివారం సంత సమీపంలో, మకరాంపురం గుడియా వీధి వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై నిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలతో పాటు పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో అవి కనిపించకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.



### గుంతలు కనిపిస్తున్నా.. స్పందన కరువు

రహదారి దుస్థితిపై సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులకు తెలిసినా ఇంతవరకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ఈ రహదారిపై అధికారులు వెంటనే దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



### ఆలయ ధర్మకర్త చొరవ

ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన మకరాంపురం షిర్డీ సాయి ఆలయ ధర్మకర్త బెందాళం రమణస్వామి చొరవ తీసుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాక్టర్‌తో సిప్స్ కంకరను తీసుకువచ్చి, జేసీబీ సాయంతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వేసి పూడ్చారు. అనంతరం జేసీబీతో రోడ్డును చదును చేశారు. గుంతలను పూడ్చి రోడ్డును చదును చేయడంతో తాత్కాలికంగా ఇబ్బందులు తగ్గడంపై గ్రామస్తులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు. శాశ్వత పరిష్కారం కోసం ఆర్అండ్‌బీ అధికారులు రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గొంద్యాల వెంకటరమణ, ఎలుసూరి పార్వతీశం, బిరకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఏపీలో పండిన జీడిగింజలకే ఏఎంసీ సెస్సు

**-దిగుమతి చేసుకునే ఆర్‌సీఎన్‌పై విధించొద్దు**

**- ప్రస్తుత జీవోను సవరించి శాశ్వత పరిష్కారం చూపాలి**

**- వారం రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం**

**-స్పష్టం చేసిన అధికారులు**

**-ఏఎంసీ కమిషనర్‌కు సమస్య తీవ్రత వివరించిన ఏపీసీఎంఏ ప్రతినిధులు**

**పలాస, ఆగస్టు 21 (వార్త):** జీడిపప్పు పరిశ్రమకు సంబంధించిన ఏఎంసీ సెస్సు అంశంపై ఆంధ్రప్రదేశ్ క్యాష్యూ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఏపీసీఎంఏ) ప్రతినిధులు ప్రభుత్వంపై తమ వాదనలను బలంగా వినిపించారు. శుక్రవారం సచివాలయంలో ఏఎంసీకి సంబంధించిన అంశంపై నలుగురు ఏడీలు, నలుగురు జేడీలతో సుమారు మూడు గంటలపాటు కీలక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో పండిన జీడిగింజలకు మాత్రమే ఏఎంసీ సెస్సు వర్తింపజేయాలని ప్రతినిధులు స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే “రా” క్యాష్యూ నట్స్ (ఆర్‌సీఎన్)పై ఏఎంసీ సెస్సు విధించరాదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సెస్సు విషయంలో తాత్కాలిక వెసులుబాటు కల్పించడం కాకుండా, ప్రస్తుతం అమల్లో ఉన్న జీవోను సవరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఏపీసీఎంఏ ప్రతినిధుల వాదనలను అధికారులు సానుకూలంగా విన్నట్లు తెలిపారు. వారం రోజుల్లో తగిన పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు వెల్లడించారు. పరిశ్రమలపై భారం తగ్గించి, జీడిపప్పు పరిశ్రమ ప్రయోజనాలను కాపాడేలా సమస్యకు ముగింపు పలకాలన్న ఉద్దేశంతో తమ అభిప్రాయాలను స్పష్టంగా వివరించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఏఎంసీ కమిషనర్ శ్రీ రవి పట్టంశెట్టిను కలిసి సెస్సు సమస్య తీవ్రతను వివరించారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ నుంచి సానుకూల స్పందన, బలమైన హామీ పొందినట్లు ఏపీసీఎంఏ ప్రతినిధులు తెలిపారు.

### పరిశ్రమ ప్రయోజనాలే లక్ష్యంగా :

జీడిపప్పు పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏపీసీఎంఏ నిరంతరం కృషి చేస్తుందని ప్రతినిధులు తెలిపారు. ఏఎంసీ సెస్సు అంశానికి శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఏపీసీఎంఏ అధ్యక్షుడు ఫణి రాఘవులు, కార్యదర్శి కుసుమంచి సుబ్బారాయులు, ఉపాధ్యక్షుడు మల్లా కాంతారావు, కార్యదర్శి వాసు, పలాస ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# జగన్‌ను కలిసిన మొదలవలస

**-పార్టీకి అంకితభావంతో పనిచేయాలి మన ప్రభుత్వం వస్తుంది**

**- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్**



**పలాస, ఆగస్టు 21(వార్త):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి మొదలవలస మన్మధరావు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి ఆయన జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వ హయాంలో నమోదవుతున్న కేసులకు పార్టీ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల మద్దతుతో భవిష్యత్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జగన్ భరోసా ఇచ్చినట్లు మొదలవలస మన్మధరావు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు మన్మధరావు తెలిపారు. ‘జగన్ 2.0’లో కార్యకర్తలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని, పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని జగన్ హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రేణులు సమష్టిగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జగన్ సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# బాలల సంక్షేమ సమితి సభ్యురాలిగా జాస్మిన్



**ఇచ్ఛాపురం ఆగస్టు 21 (వార్త):** జిల్లా బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంరక్షణ, పునరావాసం బాలల సంక్షేమ రంగాల్లో గత 16 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న రెంటపల్లి జాస్మిన్ కుమారిని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా బాలల సంక్షేమ సమితి (సి డబ్ల్యూ సి )సభ్యురాలిగా నియమించింది. స్థానిక బెల్లు పడ కోలనీ కి చెందిన రెంటపల్లి జాస్మిన్ కుమారి ఉన్నత విద్యార్హతలు కలిగి ఉన్నారు.ఆమెకు బాలల హక్కుల పరిరక్షణ పట్ల ఉన్న ప్రత్యేక ఆసక్తి, సేవాభావం కారణంగా తనకు లభించిన ఇతర ఉద్యోగ అవకాశాలను సైతం పక్కనపెట్టి బాలల సేవను తన జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు.

### 16 ఏళ్లుగా చైల్డ్ హెల్ప్ లైన్‌లో విశేష సేవలు

జాస్మిన్ కుమారి గెస్ట్ ఆర్గనైజేషన్ చైల్డ్ హెల్ప్ లైన్ సబ్-సెంటర్ కోఆర్డినేటర్‌గా సుమారు 2011 నుండి 2026 వరకు 16 సంవత్సరాల పాటు నిరంతరం సేవలందించారు. ఈ కాలంలో ఆపదలో ఉన్న, రక్షణ సంరక్షణ అవసరమైన అనేక మంది బాలబాలికలను గుర్తించి, వారికి తక్షణ సహాయం అందించడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించేందుకు కృషి చేశారు. చైల్డ్ హెల్ప్ లైన్ మిషన్ వాస్త్యల్య మహిళా, శిశు సంక్షేమ శాఖలో విలీనం అయిన అనంతరం, ప్రస్తుతం పలాస రైల్వే స్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రైల్వే ప్రయాణాల సందర్భంగా ఆపదలో ఉన్న, తప్పిపోయిన, కుటుంబానికి దూరమైన మరియు వివిధ కారణాలతో రక్షణ అవసరమైన వేలాది మంది బాలబాలికలను గుర్తించి రక్షించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. రక్షించబడిన పిల్లలకు కౌన్సెలింగ్, పునరావాసం, కుటుంబ పునరేకీకరణ, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం వంటి సేవలను అందించారు.

### సేవలకు ప్రభుత్వం గుర్తింపు

బాలల హక్కుల పరిరక్షణ రంగంలో జాస్మిన్ కుమారి కలిగి ఉన్న దీర్ఘకాలిక అనుభవం, అంకితభావం సేవలను పరిగణనలోకి తీసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఇటీవల విడుదల చేసిన నియామకాల్లో ఆమెను శ్రీకాకుళం జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యురాలిగా నియమించింది.ఈ సందర్భంగా జాస్మిన్ కుమారి మాట్లాడుతూ, బాలల సంక్షేమ సమితి సభ్యురాలిగా తనపై బాధ్యత మరింత పెరిగిందని, బాలల హక్కులు మరియు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసి, ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. తనను బాలల సంక్షేమ సమితి సభ్యురాలిగా ఎంపిక చేయడంలో ఎమ్మెల్యే బెందలం . అశోక్ కుమార్ సహాయ సహకారాలు ఎంతో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అలాగే తన నియామకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణలో పనిచేస్తున్న సహచరులు, శ్రేయోభిలాషులు మిత్రులందరికీ జాస్మిన్ కుమారి కృతజ్ఞతలు తెలిపారు. “బాలల రక్షణ, సంరక్షణ మరియు సంక్షేమం కోసం ఇకపై కూడా 24/7 అందుబాటులో ఉంటానని . ప్రతి బాలబాలికకు సురక్షితమైన బాల్యం, మంచి విద్య, సముచితమైన పునరావాసం మెరుగైన భవిష్యత్తు అందించేందుకు నా వంతు కృషి చేస్తాను” అని జాస్మిన్ కుమారి తెలిపారు.



# అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శిరీష దంపతులు

**-వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తిరుచానూరులో ప్రత్యేక పూజలు**

**-లోక కల్యాణం కోసం ప్రార్థనలు**

**పలాస, ఆగస్టు 21 (వార్త):** శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తిరుచానూరు ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి దర్శనం అనంతరం నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్న చౌదరి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అమ్మవారి ఊరేగింపు, ఉత్సవ విగ్రహ దర్శనం భక్తులకు కన్నుల పండువగా నిలిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని, సమస్త లోకానికి శుభం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ప్రార్థన చేసామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దంపతులు తెలిపారు.

# కాశీబుగ్గలో శిష్టు దమయంతి లాపరోస్కోపిక్, లేజర్ క్లినిక్ ప్రారంభం.



**పలాస, ఆగస్టు 21(వార్త):** పలాస-కాశీబుగ్గ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రముఖ లాపరోస్కోపిక్ సర్జన్ డా. శిష్టు మనోజ్‌కుమార్ నేతృత్వంలో శిష్టు దమయంతి లాపరోస్కోపిక్, లేజర్ క్లినిక్ కాశీబుగ్గలో శుక్రవారం ప్రారంభం చేశారు. క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా. మనోజ్‌కుమార్ తల్లిదండ్రులు శిష్టు దమయంతి, శిష్టు సారథినాయుడు ఆసుపత్రిని ప్రారంభించారు. రిసెప్షన్ విభాగాన్ని రోణంకి వెంకటరమణమూర్తి ప్రారంభించగా, డాక్టర్స్ ఛాంబర్‌ను కొంక్యాన మురళీధర్, మంగమ్మ, కొంక్యాన వేణుగోపాల్ ప్రారంభించారు. ప్రొసీజర్ విభాగాన్ని శిష్టు చిరంజీవులనాయుడు, ఉషా దంపతులు ప్రారంభించారు. లేబొరేటరీ విభాగాన్ని చింతాడ చిన్నారావు, ప్రభావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు క్లినిక్‌ను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. జనరల్ సర్జన్లు డా. దువ్వాడ జీవితేశ్వరరావు, డా.నూక కూర్మారావు, ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డా.వినోద్‌కుమార్, గైనకాలజిస్టులు డా.అశ్వని, డా.కొంక్యాన మాధురి, మెడికవర్‌కు చెందిన వైద్య నిపుణులు డా.స్వామినాయుడు, డా.సాయినాథ్, డా.అమర్‌కార్తీక్, డా.తమ్మినేని పాపారావు, తదితర వైద్యులు డా. శిష్టు మనోజ్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. స్థానికంగా ఆధునిక వైద్య సేవలకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన అధ్యక్షుడు ధవళ ఆనందరావు, కోశాధికారి కొంక్యాన శివశంకర్, డా.మనోజ్‌కుమార్ స్వగ్రామమైన మహాదేవిపురం ఎంపీటీసీ శాంతారావు, గ్రామ పెద్దలు కూన మోహనరావు, శిష్టు నాగేశ్వరరావు, కామేశ్వరరావు తోపాటు పలువురు ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తొట్టెలు నిర్మించారు.. నీరు మరిచారు..!

**- పశువుల దాహార్తి తీర్చేందుకు రూ.5.95 లక్షలతో 17 తొట్టెల నిర్మాణం**

**- నీటి సౌకర్యం లేక తామరపల్లి సహా పలు గ్రామాల్లో నిరుపయోగం**

**- ప్రజాధనం వృథా కాకుండా వెంటనే నీటి వసతి కల్పించాలని స్థానికుల డిమాండ్**



**నరసన్నపేట, ఆగస్టు 21(వార్త):** పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నీటి తొట్టెలు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారుతున్నాయి. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.35 వేల చొప్పున వ్యయం చేసి సుమారు 17 చోట్ల తొట్టెలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిలో నీరు నింపేందుకు సరైన వసతి కల్పించకపోవడంతో ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తామరపల్లి సహా మండలంలోని పలు గ్రామాల్లో పశువులు, మూగజీవాల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో ఈ తొట్టెలను నిర్మించారు. ఉపాధి హామీ నిధుల ద్వారా ప్రజోపయోగ కార్యక్రమంగా వీటిని ఏర్పాటు చేసినప్పటికీ, నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణపై అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవి కాలంలో పశువులకు తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న సమయంలో ఈ తొట్టెలు ఎంతో ఉపయోగపడాల్సి ఉండగా, నీటి సదుపాయం లేక ఖాళీగా కనిపిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఒక్కో తొట్టెపై రూ.35 వేల చొప్పున సుమారు రూ.5.95 లక్షల ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ, అవి వినియోగంలోకి రాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారులు వెంటనే స్పందించి తొట్టెలకు నీటి సరఫరా కల్పించాలని, అవసరమైన చోట బోర్లు, పైపులైన్లు లేదా ఇతర నీటి వనరులతో అనుసంధానం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా నిర్మించిన తొట్టెలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డొంకూరు విద్యార్థికి కాంస్య పతకం

**ఇచ్ఛాపురం ఆగస్టు 21 (వార్త):** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డొంకూరు విద్యార్థి రామ్ చరణ్ కాంస్య పతకం పొందారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.హేమకుమారి ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభ కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. తిరుపతి వేదికగా జరిగినటువంటి 37వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో అండర్ 14/ ట్రైయాతలాన్ గ్రూప్ (సి) విభాగంలో అనగా 60మీటర్లు , లాంగ్ జంప్,600మీటర్లు లో రాంచరణ్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం పొందారు. వీరికి పాఠశాల చైర్మన్ జానకీ రావు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు సిహెచ్ వెంకటరమణ, శ్రీహరి, శంకర్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామస్తులు విద్యార్థులు విద్యార్థులు అభినందించారు.



# మూగుపురంలో ఇంటింటికీ తెలుగుదేశం

**- ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు**

**- గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్న ధర్మాన తేజ్‌కుమార్**

**- సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ**



**సారవకోట, ఆగస్టు 21(వార్త):** పెద్దలంబ పంచాయతీ పరిధిలోని మూగుపురం గ్రామంలో నిర్వహించిన ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ పాల్గొని గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. గ్రామస్తులు తెలిపే సమస్యలను నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ధర్మాన తేజ్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ ఇసై నాగరాజు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బుడితి దామోదర్, చిట్టిబాబు, మాజీ సర్పంచ్ లచ్చయ్య, పెద్దలంబ గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు డోలా శ్రీను, కొండల బాలకృష్ణ, లుకలాపు గోపాల్, ఊర్జన తిరుపతిరావు, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిల్లా నందకిషోర్‌తో పాటు పెద్దలంబ గ్రామ పంచాయతీ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్
- వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతుల స్వీకరణ
- పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి, రహదారులు, తాగునీటి సమస్యలపై అర్జీలు
- సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ



**పోలాకి, ఆగస్టు 21 (వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. గౌరవ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సూచనలు, ఆదేశాల



మేరకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చి తమ వ్యక్తిగత, ప్రజా సమస్యలను బగ్గు అర్చన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజలతో ఆమె నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్యను ఓపికగా విని, వాటి వివరాలను నమోదు చేసుకుని సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి అవకాశాలు, రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయం, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి అంశాలకు సంబంధించిన అర్జీలతో పాటు ఇతర మౌలిక వసతుల సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ప్రజలు అందజేసిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బగ్గు అర్చన హామీ ఇచ్చారు. పరిష్కారం సాధ్యమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించగా, వాటి పరిష్కారంపై సానుకూల చర్యలు తీసుకుంటామన్న హామీతో వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



**పలాస, ఆగస్టు 21 (వార్త):** పలాస-పూండి రైల్వే స్టేషన్ల మధ్య గరుడకండి సమీపంలో రైలు ప్రమాదానికి గురై గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలియకపోవడంతో ఆమె ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వయస్సు సుమారు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఆమె ఆకుపచ్చ రంగు జాకెట్, లేత గులాబీ రంగు చీర ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఆనవాళ్లతో ఉన్న వృద్ధురాలు తమ ప్రాంతం నుంచి ఎవరైనా కనిపించకుండా పోయినట్లయితే, వారి కుటుంబ సభ్యులు లేదా బంధువులు పలాస గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ విషయమై ఆచూకీ తెలిస్తే పలాస జీఆర్పీ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ దుంపల శ్రీనివాసరావు 9247585738 తెలియజేయవలసిందిగా కోరారు .

## గ్రామాల్లో పారిశుధ్య పనులు



**జి.సిగడాం, ఆగస్టు 21(వార్త):** సీతంపేట గ్రామ పంచాయతీ అన్ని వీధుల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టి పిచ్చి మొక్కలు, డ్రైనేజీల్లో చెత్త చెదారం తొలగించి శుభ్రం చేయిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి పైల శ్రీరాములు తెలిపారు. మూడు రోజులుగా గ్రామంలో పారిశుధ్య పనులు చెప్పారు. ఈ పనులను ఎంపీడీఒ జి. రామకృష్ణారావు పరిశీలించారు. అయెన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత- ప్రతీ ఒక్కరి ఆర్యోగ భద్రత అని అన్నారు.మురుగు కాలువ పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేయించారు. వీధుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేయాల్సిన పనులను సిబ్బందికి సూచించి త్వరగా చేయాలని ఆదేశించారు. అనంతరం మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేపట్టారు. అన్ని త్రాగు నీటి బావులు, బోర్లు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ నిర్వహించారు.

## నూకాలమ్మకు విశేష అలంకరణ

- 15వేల గాజులతో ఆకట్టుకున్న వైనం

**కంచిలి, ఆగస్టు 21(వార్త):** కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామంలో వెలసిన శ్రీ నూకాలమ్మ అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా 15001 గాజులతో చేపట్టిన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. జిల్లాలోనే తొలిసారిగా ఇంత పెద్ద సంఖ్యలో గాజులతో అమ్మవారిని ఇక్కడే అలంకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీరాంపురంతో పాటు చుట్టుపక్కల మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. వరలక్ష్మీ వ్రతం రోజున అమ్మవారికి గాజుల అలంకరణ చేయడం ఎంతో శుభప్రదమని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గాజులు సమర్పించిన ప్రతిభక్తునికి కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.



# బొంతు ఎత్తిపోతల పనులు ఎప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని పథకం
-రైతులకు తప్పని ఎదురుచూపులు
- వర్షాభావంతో 50 గ్రామాల్లో తీవ్ర ఆందోళన
- పంటలు ఎండిపోతుండటంతో ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని డిమాండ్

**సారవకోట, ఆగస్టు 21(వార్త):** సారవకోట మండలంలోని రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన బొంతు ఎత్తిపోతల పథకం పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నప్పటికీ పూర్తికాకపోవడం, మరోవైపు ఈ ఏడాది తగిన వర్షాలు కురవకపోవడంతో సుమారు 50 గ్రామాల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సాగునీటి సదుపాయం లేక పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సాగు అవసరాలను తీర్చేందుకు ఈ ఎత్తిపోతల పథకానికి 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అయితే శంకుస్థాపన జరిగి ఏళ్లు గడుస్తున్నప్పటికీ ప్రాజెక్టు పనులు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో సాగునీటి కొరత మరింత తీవ్రంగా మారింది. ఇప్పటికే సాగు చేసిన పంటలు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని, మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ప్రత్యామ్నాయ నీటి వనరుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. బొంతు ఎత్తిపోతల పథకం పూర్తయితే సారవకోట మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి, మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పంటలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బొంతు ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పూర్తి చేసి రైతుల కష్టాలకు ముగింపు పలకాలని 50 గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో స్టేమి ఇంజెక్షన్లు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 21(వార్త):** ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న స్టెమీ ఇంజెక్షన్నీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి దేవేందర్ రెడ్డి తెలిపారు.. ఛాతీలో తీవ్రమైన నొప్పి, ఎడమ చేతికి లాగడం, విపరీతమైన చెమటలు పట్టడం వంటి గుండెపోటు లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకూడదని .వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా కమ్యూనిటీ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుండెపోటు (స్టేమి )బాధితుల ప్రాణాలు కాపాడేందుకు సుమారు రూ. 40,000 విలువైన అత్యవసర 'టెనెక్టప్లేస్' ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తోంది. 'గోల్డెన్ అవర్' (మొదటి గంట)లో ఈ చికిత్సను పొందడం ద్వారా గుండెపోటు మరణాలను చాలా వరకు నివారించవచ్చునని చెప్పారు. డొంకూరు గ్రామం కి చెందిన దున్న శేషగిరి(59) ఛాతి నొప్పితో బాధపడగా పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకువచ్చారు. అక్కడ ఇంజక్షన్ 50,వేలు చెల్లించాలని అన్నారు. దీంతో పేషెంట్ ని ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకురాగా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న స్టేమి ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయ స్థితిని నుండి కాపాడారు. అనంతరం మెరుగైన చికిత్స కొరకు 108 అంబులెన్స్ లో శ్రీకాకుళం తరలించారు..

## భక్తి శ్రద్ధలతో సంతోషిమాత శోభాయాత్ర

- కలశాలతో పాల్గొన్న మహిళలు
- సారవకోట, గొర్రిబంద గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం

**సారవకోట, ఆగస్టు 21(వార్త):** సారవకోట, గొర్రిబంద గ్రామాల్లో శుక్రవారం సంతోషిమాత అమ్మవారి ఉత్సవ విగ్రహ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా వచ్చిన వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేకంగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహించారు. సంతోషిమాత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో భక్తి వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రెండు గ్రామాలకు చెందిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో కలశాలు పట్టుకొని శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో శోభాయాత్ర ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా నిర్వహించిన ఈ శోభాయాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ కార్యక్రమం గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని తీసుకువచ్చింది.



## తామరపల్లి జాతీయ రహదారిపై ప్రమాదకర గుంతలు

- గుంతలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి



**నరసన్నపేట, ఆగస్టు 21(వార్త):** తామరపల్లి జాతీయ రహదారిపై పలు చోట్ల ప్రమాదకర గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై గుంతలు ఏర్పడినా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ రహదారిపై ప్రయాణించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు అంచనా వేయడం కష్టంగా మారుతోందని తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు పేర్కొన్నారు. సరైన వెలుతురు లేని ప్రాంతాల్లో గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు పొరపాటున వాటిలో పడే ప్రమాదం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా ప్రయాణించే వాహనాలకు కూడా ఈ గుంతలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ రహదారి నిర్వహణకు సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లోపమే రహదారి దుస్థితికి ప్రధాన కారణమని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. రహదారిని అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి, దెబ్బతిన్న ప్రాంతాల్లో తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన తర్వాత చర్యలు తీసుకునే బదులు ముందస్తుగా గుంతలను పూడ్చి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546